# నాయకుడు




—డాక్టర్ పి.వి. రమణ

చలమయ్యకు ఆరాత్రంతా కంటిపైకునుకు లేదు. మనసులో డైనమేట్లు బ్రద్దలవుతుంటే పై కప్పు కేసి చూస్తూ వుండిపోయాడు బితుకు బితుకుమంటూ.

పథకం మీద పథకం... వ్యూహం మీద వ్యూహం... యుక్తికుయుక్తుల సమరం..., చలమయ్య మెదడు నరాలన్నీ నలిగి నలిగి పురివిడిన దారాల్లా పుటుక్కుమనేట్లున్నాయి. తెల్లవార్లూ ఎడతెగని ఆలోచనల ఆటుపోటులతో రాపిడి చెందిన చలమయ్య మనసుకు ఉదయానికేదో ఇంత ఆసరా దొరికినట్లైంది; ఫలితం దక్కవచ్చన్న ఆశ సన్నగా మొలకెత్తింది. ఆత్రంగా లేచాడు మంచం మీద మంచీ. అయిపోయినై అన్పించేట్లుగా కాలకృత్యాలను ముగించాడు. ఆవురావురుమంటూ కదుపుకి తిండి పడేశాడు. ఆపై నడిమింటికి జేరి ఇంటిల్లిపాదినీ తన చుట్టూ చేర్చాడు.

"ఇప్పుడు నేను చెప్పబోయే విషయం లోగడలా 'మనకు కల్సివచ్చేదో కాదో మరి. కొంపలంటుకుపోతున్న ఈ తరుణంలో ఇంతకంటే గత్యంతరం లేదు. ఉరితో చావడం కన్నా, ఊబిలో దిగడం మేలు. సర్వనాశనం కన్నా, సగం నాశనం మంచిది..." చలమయ్య ఉపోద్ఘాతాన్ని దేవమ్మ ఓపికగా వినలేకపోయింది.

"ఆ చెప్పేదేదో సూటిగా చెప్పరాదూ సాగదీయక..."

"నీ పిల్లల్ని వర్ణసంకరం చేయించాలి..."

"అంటే..." దేవమ్మ నుదురు చిట్లించి అడిగింది.

"కులం తక్కువ వాళ్ళతో ఇప్పుడు మనం వియ్యమందాలి..." తన పథకంలో ఒక్కో పొర విప్పుకున్నాడు చలమయ్య. దేవమ్మ ముఖంలోనిప్పులు రాజుకుంటున్నాయి.

"నాకా గతేం పట్టింది? లక్షలతో లక్షణంగా వచ్చే సంబంధాలుండగా..." ధీమాగా అంది దేవమ్మ.

"పిచ్చిదానా; నేను అధికారంలో వుంటేనే అవన్నీ జరిగేది. ప్రస్తుతం నా పదవికే బెడద వచ్చింది. ఈ తుఫాన్‌లో సొంతం కొట్టుకుపోక ముందే ఏదో తరుణోపాయం చూసుకోవాలి. ఆపద్ధర్మంగానైనా సరే, ఏదో ఒక ఆధారాన్ని పట్టుకోవాలి. ప్రస్తుతానికి నేనొక పథకం ఆలోచించాను. దాన్ని ఆచరణలోకి తెచ్చే ముందు నీ అనుమతీ నాకెంతో అవసరం; నీ సహకారమూ తప్పనిసరి...

"అబ్బబ్బ... మళ్ళీ ఉపన్యాసం; చచ్చు సొద..." దేవమ్మ మరోసారి ఛీత్కారం చేసింది.

"నేను పదవిలో వుండడం నా కన్నా నీకే ఎంతో అవసరం... కాదంటావా?"

"అదుంటేనే గదా, అన్నీ అమిరేది. కాలు క్రింద పెట్టనవసరం లేకుండా కారు మీద పోగరిగేది. పైసా మనది ఖర్చు గాకుండా పైలాపచ్చీసుగా బ్రతగ్గలిగేదీ..."

"మరైతే మనకిప్పుడు వర్ణ సంకరం తప్పదుగాక తప్పదు"

కుండ బద్దలుకొట్టినట్టు చెప్పాడు చలమయ్య. "దానికీ దీనికీ ముడిపెడతావు దేనికి?" రుసరుసలాడింది దేవమ్మ.

"ఆవేశపడకు; వర్ణాంతర వివాహాలు, అదే అట్టడుగు వర్గాలవాళ్ళ పిల్లల్ని చేసుకొన్నాళ్ళకే ఇహ ముందు ఎన్నికల్లో టిక్కెట్లు లభించేదని పార్టీ ప్రకటించింది. ఎన్నికల్లో నిలబడాలంటే బడుగు జీవుల సంతానాన్ని పెళ్ళాడక తప్పదు. ముందే పెళ్ళై వుంటే కనీసం అట్టడుగు వర్గాల వాళ్ళతో వియ్యమైనా అందాలిట; అట్లా చేయకపోతే కనీసం పంచాయతీ ఎన్నికల్లో కూడా పార్టీ టికెట్టు లభించే అవకాశం రాదు..." సగం చచ్చిపోతూ పలికాడు చలమయ్య.

"ఉన్నట్లుండి ఈ పాడు బుద్ధులెందుకు పుట్టాయి మీ పార్టీ వాళ్ళకు?"

"ఇట్టా వర్ణాంతర వివాహాలు జరిపించి, దేశంలో కులాల్ని నిర్మూలిస్తారంట; పదవి కోసం ఎగబడే ప్రతివాడూ ఇట్లా చేస్తే ఇహ ముందు కులాలనేవి దేశంలో వుండవని పార్టీ పెద్దల భ్రమ. అది సరే; ఇప్పుడు ఈ ప్రమాదం నుండి మన మెట్లా బయటపడాలి? ఏ కులం తక్కువ గడపతో మనం వియ్యమందాలి?"

"ఈ యవ్వారానికి మన పిల్లల్నే ఎందుకు బలిపెట్టాలి? వున్నాడుగా, ఏ దిక్కూ లేని మీ మేనల్లుడు; అతగాడిని తీసికొచ్చి, మనమే అండగా వుండి, ఏ కులం తక్కువ పిల్లదాన్తోనో ముడివేసేద్దాం;" దేవమ్మ సలహా ఇచ్చింది. దేవమ్మకు, అఫ్ట్రాల్... తన పరువు మీద సవారీ జేసే దేవమ్మకు... ఇంత ఆలోచనా...! ఇంత యుక్తా! ఆ ఆలోచన తనకు రానందుకు సిగ్గుపడిపోయాడు చలమయ్య. తన రాజకీయ పరిజ్ఞానాన్ని తిట్టిపోసుకున్నాడు.

ఆ వారం రోజులూ కాలికి బలపం కట్టుకొన్నట్లు మేనల్లుడి చుట్టూ తిరిగాడు; నయానా భయానా చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు మేనల్లుణ్ణి; మెడలు వంచి ఆశలు పెంచి వివాహానికి వప్పించాడు. బడుగు వర్గం వాళ్ళు నివసించే ప్రక్కగూడేనికి రాయబారాలు నడిపించి; వున్నంతలో కంటికి నదురుగా కన్పించే పిల్లను మేనల్లుడి మెడకంటగట్టి, 'అభ్యుదయుడి'గా తనను తాను ప్రదర్శించుకున్నాడు. ఇక రాగల అభ్యుదయానికి ఎదురుచూస్తున్నాడు.

రాబోయే అధికార యోగం రుచీ వాసనా ఘుమఘుమాయింపులతో ముక్కుపుటాల నావహించి నోరూరిస్తుంటే, చలమయ్య మేనల్లుడు మాత్రం యోగ నిద్రలో ఎట్లా పడివుంటాడు? నాకెందుకులే పదవి అన్నట్లెలా ఊరుకొంటాడు? వర్ణాంతర వివాహం చేసికొన్న అసలు సిసలైన వ్యక్తిని తానేననీ, చలమయ్యకు ఈ విషయంలో ఎటువంటి సంబంధమూ లేదనీ, అందువల్ల రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తనకే టికెట్ ఇవ్వవలసిందిగానూ పార్టీ మహారథులందరికీ చలమయ్య మేనల్లుడు రాయబారాలు నడిపించాడు. అంతేగాక చలమయ్య ప్రతిపక్ష గుడారంతో బేరసారాలు గూడా సాగించాడు మేనల్లుడు. పాలిటిక్స్‌లోని 'ఫాల్స్ ట్రిక్స్'నీ, కీలకాల్నీ ఆకళింపుజేసికొన్నాడు. తను వివాహమాడిన గూడెం వాళ్ళందర్నీ తన వెంట తిప్పుకోగలిగాడు. "నీవు నేర్పిన విద్యయే మేనమామ" అంటూ మామకే పాఠాలు చెప్పడం మొదలెట్టాడు.

ఏమైతేనేం, చలమయ్య మేనల్లుడికే పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో టికెట్ లభించింది. తమ గూడెంలోకి చలమయ్య వస్తే, రాజకీయ కక్షలతో గూడెం గూడెం భగ్గుమంటుందనీ, అందువల్ల తమ గూడెంలోకి చలమయ్య కాలు పెట్టే వీలు లేదనీ గూడెం పెద్దలు ఆంక్షలు విధించారు. దెబ్బ మీద దెబ్బ తిన్న చలమయ్య గిలగిల్లాడిపోయాడు. చలమయ్య అలా గిలగిలలాడుతుండగానే, మేనల్లుడు ఎన్నికల్లో అఖండ విజయం సాధించాడు. బ్రహ్మాండమైన ఊరేగింపూ జరిగింది. ఒకప్పుడు తను కలలు కన్న ఆ ఊరేగింపుకు ఊరూ పేరూ లేని తన మేనల్లుడు నాయకుడు కావడం చూళ్ళేక... ఇంట్లో కూచున్న చలమయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అయినా, నాయకుడిలో ఆశలు చావవు కనుక, కొత్త నాయకుడి ఎత్తులను చిత్తు చేయాలని పై ఎత్తులు వేసుకుంటున్నాడు పాత నాయకుడు.